నమస్తే తెలంగాణ

నిపుణ

Guide to Excellence

www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna

08.

nipuna

Every Wednesday Free Supplement

9 అక్టోబర్ 2024

పేజీలు 8

### కొత్త ఆధార సంవత్సరం

జీడీపీ గణాంకాలకు సంబంధించి 2022-23ను ఆధార సంవత్సరంగా తీసుకోవాలని కేంద్రం ప్రతిపాదించింది. ప్రస్తుతం ఉన్న ఆధార సంవత్సరం 2011-12. ఆర్థికవేత్త బిశ్వనాథ్ నేతృత్వంలో 26 మందితో కలిసి కేంద్రం ఒక కమిటీని నియమించింది. దాని సూచన మేరకు ఆధార సంవత్సరాన్ని మార్చనుంది. ఈ సంవత్సరం ధరలతో తొలి గణాంకాలు ఫిబ్రవరి 2026లో వెలువడుతాయి.

## అంతర్జాతీయం



**యక్షగాన మండలి**

- యునెస్కో నుంచి శ్రీ ఇడగుంజి మహా గణపతి యక్షగాన మండలి కెరెమనేకు గుర్తింపు లభించింది. ఈ ఘనతను దక్కించుకున్న తొలి యక్షగాన మండలి ఇదే. దీన్ని 1934లో ఏర్పాటు చేశారు. ఈ మండలి ఇప్పటికే 9000 ప్రదర్శనలు ఇచ్చింది. కేవలం భారత్‌లోనే కాకుండా విదేశాల్లోనూ ఈ ప్రదర్శనలు సాగాయి. యక్షగానం అనేది 11వ శతాబ్దం నుంచి 16వ శతాబ్దం మధ్య అత్యధిక ప్రాచుర్యం పొందింది.

**శ్రీలంక**

- 0.5% ప్రతిద్రవ్యోల్బణం శ్రీలంకలో నమోదయ్యింది. గడిచిన 40 సంవత్సరాల్లో ఈ విధంగా ఆ దేశంలో ధరలు పడిపోవడం ఇదే ప్రథమం.

**పర్సోనా నాన్‌గ్రేటా**

- ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్‌ను తమ దేశంలోకి రాకుండా ఇజ్రాయెల్ నిషేధం విధించింది. 'పర్సోనా నాన్‌గ్రేటా' అనే పదాన్ని వినియోగించింది. దౌత్య సంబంధాలకు చెందిన వియన్నా ఒప్పందంలో ఈ పదం ఉంటుంది. ఒక వ్యక్తి రాక ఇష్టం లేదన్న భావనను వ్యక్తం చేసేందుకు ఈ పదాన్ని వినియోగిస్తారు.

**హరిత ఆర్థిక ఫోరం**

- ప్రపంచ హరిత ఆర్థిక ఫోరం సమావేశం దుబాయ్‌లో నిర్వహించారు. 'ప్రపంచ కార్యాచరణకు సాధికారత సాధించడం: అవకాశాల సృష్టి, ప్రగతిలో ముందుకెళ్లడం' అనే ఇతివృత్తంతో ఈ సమావేశం చేపట్టారు. పర్యావరణ మార్పు, సుస్థిరాభివృద్ధి సాధనకు అంతర్జాతీయ స్థాయిలో ఏ తరహా సహకారం అందుకోవాలో ఈ సమావేశంలో చర్చించారు.




## రోజులు-ప్రాముఖ్యం

**అక్టోబర్ 2**

- అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా అక్టోబర్ 2న నిర్వహిస్తారు. మహాత్మా గాంధీ జయంతి. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించారు. అలాగే ఇదే రోజు లాల్ బహదూర్ శాస్త్రి జయంతి. దేశానికి ప్రధాన మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రెండో వ్యక్తి ఆయన. జై జవాన్, జై కిసాన్ అనే నినాదాన్ని ఇచ్చారు. హరిత, శ్వేత విప్లవాలు ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు ప్రారంభమయ్యాయి.

**అక్టోబర్ 1**

- ఏటా అక్టోబర్ 1న అంతర్జాతీయ వృద్ధుల రోజుగా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇతివృత్తం 'వయస్సు-హుందాతనం: ప్రపంచ వ్యాప్తంగా వృద్ధులకు ఊతమిచ్చే వ్యవస్థల బలోపేతం ప్రాధాన్యం'.

**సెప్టెంబర్ 30**

- అంతర్జాతీయ అనువాదపు రోజు.

**సెప్టెంబర్ 29**

- ఆహార నష్టం-వృథాపైన అవగాహన కల్పించే అంతర్జాతీయ రోజు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో 12 (3) ఆహార వృథాను అరికట్టాలని సూచిస్తుంది.

## క్రీడలు

**ఖోఖో ప్రపంచ కప్**

- ప్రపంచంలో తొలిసారి ఖోఖో ప్రపంచ కప్‌ను భారతదేశంలో నిర్వహించనున్నారు. 2025లో జరగనుంది. ఆరు ఖండాలకు సంబంధించి 24 జట్లు ఇందులో పాల్గొంటాయి. మహిళ, పురుష క్రీడాకారులకు వేర్వేరుగా పోటీలు ఉండనున్నాయి.

**భారత్ విజేత**




- ఎస్ఏఎఫ్ఎఫ్ అండర్-17 ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను భారత్ గెలుచుకుంది. తుదిపోరులో భారత్ బంగ్లాదేశ్‌ను ఓడించింది. ఈ టోర్నీని భూటాన్‌లో నిర్వహించారు.

**రవీంద్ర జడేజా**

- టెస్ట్ క్రికెట్‌లో 300 వికెట్లు తీసుకున్నాడు. ఈ ఘనతను దక్కించుకున్న భారత ఏడో బౌలర్. ఇప్పటి వరకు అనిల్ కుంబ్లే, రవిచంద్రన్ అశ్విన్, కపిల్ దేవ్, హర్భజన్ సింగ్, జహీర్ ఖాన్, ఇషాంత్ శర్మ టెస్ట్ క్రికెట్‌లో భారత్ తరఫున 300కు పైగా వికెట్లు తీసుకున్నారు.

## తెలంగాణ

**సోమశిల, నిర్మల్‌కు పురస్కారాలు**




- రాష్ట్రంలోని నాగర్‌కర్నూలు జిల్లా సోమశిల, నిర్మల్ జిల్లా ప్రధాన కేంద్రం నిర్మల్ ఉత్తమ పర్యాటక గ్రామాల పురస్కారాలను గెలుచుకున్నాయి. కేంద్ర పర్యాటక శాఖ 2024కు ఎనిమిది క్యాటగిరీల్లో నిర్వహించిన పోటీల్లో స్పిరిచ్యువల్-వెల్‌నెస్ విభాగంలో సోమశిల, క్రాఫ్ట్స్ విభాగంలో నిర్మల్ గ్రామాలు ఎంపికయ్యాయి. నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలంలోని సోమేశ్వర క్షేత్రం సోమశిలగా మారింది. అలాగే నిర్మల్ కళాకారులు కర్రతో సజీవంగా ఉండే బొమ్మలను తయారు చేస్తున్నారు.

**డిజిటల్ కార్డులు**

- బహుళ ప్రయోజనాలు చేకూర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్డుల జారీ కోసం 119 శాసనసభ నియోజకవర్గాల్లో 238 ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టులను అక్టోబర్ 3న చేపట్టారు. డిజిటల్ కార్డుల్లో మహిళలనే ఇంటి యజమానురాలిగా గుర్తించనున్నారు.

**తగ్గిన కేంద్రసాయం**

- కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి గ్రాంట్ల రూపంలో రావాల్సిన నిధులు భారీగా తగ్గాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో తొలి ఐదు నెలల్లో కేంద్రం నుంచి రూ.3009.26 కోట్లు రాగా ఈ ఆర్థిక సంవత్సరంలో వచ్చింది కేవలం రూ.562 కోట్లు మాత్రమే. పన్నేతర ఆదాయం గతేడాది రూ రూ.14,482 కోట్లు రాగా ప్రస్తుత ఏడాది రూ.13,033 కోట్లకు తగ్గిందని కాగ్ తన నివేదికలో వెల్లడించింది.

**మెట్రో రెండో దశ ప్రతిపాదన**

- హైదరాబాద్‌లో మెట్రో రైలు రెండో దశలోని ప్రతిపాదిత ఆరు కారిడార్లలో ఐదింటికి సంబంధించి డీపీఆర్‌లు దాదాపుగా సిద్ధమయ్యాయి. 116.2 కిలోమీటర్ల మెట్రో మార్గాల నిర్మాణానికి రూ.32, 237 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు.

**తుది ఓటర్ల జాబితా**

- తెలంగాణలో పంచాయతీ ఓటర్ల తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. 12,867 గ్రామ పంచాయతీల్లో 1,13,722 వార్డుల్లో 1,67,33,584 మంది ఓటర్లు ఉన్నారు. అత్యధికంగా నల్లగొండ జిల్లాలో, అత్యల్పంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఓటర్ల సంఖ్య నమోదయ్యింది.

## వార్తల్లో వ్యక్తులు

**జూకంటి అరవింద్‌కుమార్**

- హైదరాబాద్‌లోని రాజేంద్ర నగర్‌లో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్త (ఐకార్) జూకంటి అరవింద్ కుమార్ ప్రపంచ మొక్కల జీవ, వృక్ష శాస్త్రం పరిశోధకుల్లో స్థానం సంపాదించారు. ప్రపంచ జాబితాలో దేశంలోని ఐకర్ నుంచి 22 మందికి చోటు దక్కగా అందులో అరవింద్ కుమార్ ఒకరు. అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ వర్సిటీ వ్యవసాయ విభాగ అధిపతిగా జాన్ పీఏ అయోడినిస్ నేతృత్వంలో ఈ పరిశోధనలు సాగాయి. 2023-24లో చేసిన పలు అధ్యయనాల ఆధారంగా ఈ జాబితాను రూపొందించారు. అరవింద్‌కుమార్ నారాయణ్‌ఖేడ్‌కు చెందిన వారు.

**ఆర్తి సరీన్**



- సాయుధ బలగాల వైద్య సేవల విభాగానికి డైరెక్టర్ జనరల్‌గా ఆర్తి సరీన్ నియమితులయ్యారు. ఈ బాధ్యతలు చేపట్టిన తొలి మహిళ ఆమె. ఈ విభాగం నేరుగా రక్షణ మంత్రిత్వ శాఖకు జవాబుదారీగా ఉంటుంది.

**మరియా కొరినా మచడో**

- వెనెజులాకు చెందిన మరియా కొరినాకు యూరోపియన్ మానవ హక్కుల అవార్డ్ దక్కింది. వెనెజులాలో ప్రజాస్వామ్యాన్ని కాపాడటం కోసం ఆమె చేస్తున్న కృషికి ఈ అవార్డ్ దక్కింది.

## జాతీయం




**సైనిక విన్యాసం**

- భారత్, కజకిస్థాన్ మధ్య ఉమ్మడి సైనిక విన్యాసం-2024 ఉత్తరాఖండ్‌లో నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 30న ప్రారంభమైంది. అక్టోబర్ 13 వరకు కొనసాగుతుంది.

**జమైకా ప్రధాని పర్యటన**

- జమైకా ప్రధాన మంత్రి ఆండ్ర్యూ హోల్నెస్ భారత్‌లో పర్యటించారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, చిన్న పరిశ్రమలు, జీవ ఇంధనం, విద్య తదితర అంశాల్లో ఇరు దేశాల మధ్య ఒప్పందాలు కుదిరాయి.

**ఐదు భాషలకు ప్రాచీన హోదా**

- బెంగాలీ, మరాఠీ, అస్సామీ, పాళీ, ప్రాకృతంలను ప్రాచీన భాషలుగా గుర్తిస్తూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఈ జాబితాలో తమిళం, సంస్కృతం, కన్నడం, తెలుగు, మలయాళం, ఒడిశా భాషలు ఉన్నాయి. క్యాబినెట్ తీసుకున్న ఇతర నిర్ణయాలు.. రైల్వే ఉద్యోగులకు 78 రోజుల వేతనాన్ని 'ఉత్పాదకతతో ముడిపడిన బోనస్' రూపంలో చెల్లింపు, సుస్థిర వ్యవసాయం, ఆహార భద్రత సాధించేందుకు 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, కృషోన్నతి యోజన' పథకాల కింద రూ.లక్ష కోట్ల వ్యయం, అంతర్జాతీయ ఇంధన హబ్‌లో చేరేందుకు నిర్ణయం.

**ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ యాప్**

- ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్లాట్‌ఫాం అనే యాప్‌ను నీతి ఆయోగ్, తెలంగాణ ప్రభుత్వం, వ్యూ హబ్ కలిసి సంయుక్తంగా ప్రారంభించాయి. ఈ యాప్ 10 భాషల్లో అందుబాటులో ఉంటుంది. వ్యాపారం ప్రారంభించడం, బ్యాంక్ రుణం పొందడం, డిజిటల్ నైపుణ్యాలు పెంచుకోవడం, బ్రాండింగ్ చేసుకోవడం ఇలా ప్రతి దశలోనూ మహిళలకు చేయూతను ఇస్తారు.

**వాతావరణ్**

- న్యూఢిల్లీలో వాతావరణ్ అనే పేరుతో సినీ ఉత్సవం అక్టోబర్ 3న ప్రారంభమైంది. పర్యావరణం, వన్యప్రాణులపై ఇది అంతర్జాతీయ సినీ ఉత్సవం. ఢిల్లీలోని పర్యావరణ్ భవన్‌లో నిర్వహించారు. మూడు రోజులు కొనసాగింది. ఈ ఏడాది ఇతివృత్తం 'జీవనంపై చిత్తడి నేలల ప్రభావం'. భారతదేశ జనాభాలో 6% మందికి చిత్తడి నేలలే ప్రత్యక్షంగా జీవనోపాధి కల్పిస్తున్నాయి.

**నావిక సాగర్ పరిక్రమ**

- నావిక సాగర్ పరిక్రమ రెండో విడత అక్టోబర్ 2న గోవాలో ప్రారంభమైంది. ప్రపంచ నౌకాయాన కార్యక్రమం ఇది. తొలి విడత 2017, సెప్టెంబర్ 10న ప్రారంభమై 2018, మే 21న ముగిసింది. తాజా విడతలో ఇద్దరు మహిళా అధికారులు నౌకాయానం చేపట్టనున్నారు. లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా, లెఫ్టినెంట్ కమాండ్ రూప ఇందులో పాల్గొంటున్నారు. మహిళా సాధికారత, లింగ సమానత్వంతో పాటు సముద్ర పరిశోధన కూడా ఈ నౌకాయానంలో భాగం చేశారు.




**రాజ్య మాతగా గోవు**

- దేశవాళి ఆవుకు మహారాష్ట్ర 'రాజ్య మాత' అనే హోదాను కేటాయించింది. ఒక జంతువుకు ఈ తరహా స్థాయి ఇవ్వడం ఇదే ప్రథమం. దేశవాళి ఆవులను కలిగి ఉన్న వాళ్లకు రోజుకు రూ.50 వరకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుంది.

**పారిశుద్ధ్య పనులు**

- పారిశుద్ధ్య పనుల్లో 91.9% ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సామాజిక వర్గం వాళ్లే ఉన్నారని కేంద్ర ప్రభుత్వ సర్వేలో తేలింది. ఇందులో 68.9% ఎస్సీ వారు కాగా, 14.7% మంది ఓబీసీ, 8.3% మంది ఎస్టీ వాళ్లు ఉన్నారని వెల్లడించింది. చేతితో పారిశుద్ధ్య పనులు చేయకుండా 2013లోనే చట్టం వచ్చినా పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు.

**ద్రవ్య విధాన కమిటీ**

- ద్రవ్య విధాన కమిటీని కేంద్రం నోటిఫై చేసింది. దీనికి ఆర్‌బీఐ గవర్నర్ ఎక్స్అఫీషియో చైర్మన్‌గా వ్యవహరిస్తారు. అలాగే ఆర్‌బీఐలోని ఒక డిప్యూటీ గవర్నర్, ఒక అధికారి ఇందులో సభ్యులుగా ఉంటారు. వీరితో పాటు డైరెక్టర్ ఆఫ్ ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ రామ్ సింగ్, ప్రముఖ ఆర్థిక వేత్త సౌగత భట్టాచార్య, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్టడీస్ ఇన్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ డాక్టర్ నగేశ్ కుమార్ సభ్యులుగా నియమితులయ్యారు.

**బియ్యం ఎగుమతి**

- బాసుమతియేతర బియ్యం ఎగుమతిపై ఉన్న నిషేధాన్ని కేంద్రం ఎత్తి వేసింది. కనీస ఎగుమతి ధరను టన్నుకు 490 డాలర్లుగా నిర్ణయించింది. 2024 ఆర్థిక సంవత్సరంలో వరిని 47.6 మిలియన్ హెక్టార్లలో సాగు చేశారు.

**జల్ హీ అమృత్**

- అమృత్ 2.0 సంస్కరణల్లో భాగంగా జల్ హీ అమృత్‌ను కేంద్రం ప్రారంభించింది. మురుగునీటి పారిశుద్ధ్యానికి సంబంధించిన కార్యక్రమం ఇది. మురుగునీటి శుద్ధి ప్లాంట్‌లను ఏర్పాటు చేసేందుకు ఉద్దేశించింది. ఆ దిశగా నగరాల మధ్య పోటీని పెంచి ప్రోత్సహిస్తుంది. శుద్ధి చేసే నీటి పరిమాణం ఆధారంగా ర్యాంకులను కేటాయించనున్నారు.



**వి. రాజేంద్ర శర్మ**
ఫ్యాకల్టీ
9849212411

